సాక్షి వరంగల్

సోమవారం | 27 | జనవరి | 2025



పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు.

- 8లో▸



యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోరారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32°/17°

జిల్లాలో ఉదయం చలి ఎక్కువ ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

హామీలను నెరవేరుస్తున్నాం..



వర్ధన్నపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వెంకట్రావుపల్లి (బొక్కలగూడెం) గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆదివారం ఆమె మంజూరుపత్రాలు అందజేశారు. 21 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 55 మందికి రేషన్‌కార్డులు, 91 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అర్థం లేని విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ విజయసాగర్ పాల్గొన్నారు.

మిర్చి సాగు పద్ధతులపై సీడీ ఆవిష్కరణ

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సౌజన్యంతో తెలంగాణ సమాచార శాఖ, సాంస్కృతికశాఖ కళాకారులు మిర్చి పంట సాగు పద్ధతులపై పాటల సీడీని రూపొందించారు. గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ సత్య శారద పాటల సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కంభంపాటి కుమారస్వామి, తుమికి రమేశ్‌బాబు, కటకం పెంటయ్య, చాంబర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

29న కొమ్మాలలో వేలం

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా పలు వ్యాపారాలకు సంబంధించి ఈ నెల 29న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయల అమ్మకానికి రూ.లక్ష, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.50 వేలు, తలనీలాల సేకరణకు రూ.20 వేలు, పుట్నాలు, పేలాల అమ్మకానికి రూ.20 వేలను డిపాజిట్‌గా ఈ నెల 28 వరకు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం షెడ్యూల్, ఇతర వివరాలకు ఆలయం వద్ద గల తమ కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

వరంగల్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వినతులు ఇచ్చేందుకు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు రావాలని ఆమె కోరారు.

డీఎస్ఓఐ జాతీయ అధ్యక్షుడిగా యాకూబ్‌పాషా




రాయపర్తి: డిసబుల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (డీఎస్ఓఐ) జాతీయ అధ్యక్షుడిగా మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎండీ.యాకూబ్‌పాషా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్ శైలజ చేతులమీదుగా ఎన్నిక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



శివఆదిత్య (ఫైల్)

గీసుకొండ: నీటి సంపులో పడి బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంపల్లికి చెందిన వేలు శుభశ్రీ భర్త చనిపోవడంతో కుమారుడు శివ ఆదిత్య (6)తో కలిసి శాయంపేటహవేలిలో నివాసం ఉంటోంది. ఆదివారం కుమారుడు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఇచ్చి స్నానం చేయడానికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఇంటివద్ద కనిపించ లేదు. చుట్టుపక్కల గాలించగా ఇంటి పక్కన ఉన్న నీటి సంపులో పడి చనిపోయి ఉన్నాడు. శుభశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.





బోల్తా పడిన భారీ ట్రేలర్ ట్రక్



ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రేలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. దేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్రరాజుకు గాయాలయ్యాయి.

- సాక్షి, వరంగల్

- పూర్తి వివరాలు 8లో▸



రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు



మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అభివృద్ధికి పెద్దపీట



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద



గణతంత్ర దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం

- భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం
- విమానాశ్రయానికి రూ.205 కోట్లు
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ సత్య శారద
- ఖుష్‌మహల్ మైదానంలో జాతీయ జెండావిష్కరణ

ఖిలా వరంగల్: జిల్లా సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మధ్య కోటలోని ఖుష్మహల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. 10,956 మంది రైతుల నుంచి సన్నరకం ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులను గుర్తించి పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

జిల్లాలో 2,66,661 మంది లబ్ధిదారులకు 509 రేషన్ షాపుల ద్వారా ప్రతినెల 49,782 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఖరీఫ్‌లో 204 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,32,763 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 28 వేల మంది రైతులకు రూ.308 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 3.12 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, 1,33,270 మంది లబ్ధిదారులకు 3,90,422 సిలిండర్లను సరఫరా చేసి సబ్సిడీ కింద రూ.11.43 కోట్లు జమ చేశామని వివరించారు. గృహజ్యోతి పథకం కింద 1,22,994 గృహాలకు 2024 మార్చినాటికి రూ.40.6 కోట్ల సబ్సిడీ అందజేశామని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు 22.89 లక్షల పనిదినాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

919 అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించి, 4,767 మంది గర్భిణులు, 4,468 మంది బాలింతలు, ఆరేళ్లలోపు 49,785 మంది పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా 72,140 ఎకరాలు, పాకాల చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 18,193 ఎకరాలకు నీరందించామని తెలిపారు. 452 పాఠశాలల్లో రూ.17.90 కోట్లతో వసతులు కల్పించామని చెప్పారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు.



కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో విదేశీ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్రీన్‌జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. భూములు కోల్పోయిన 863 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రభుత్వం ఇటీవల రూ.205 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం ప్రభుత్వం రూ.4,170 కోట్లు కేటాయించిందన్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో రూ.43 కోట్ల వ్యయంతో 176 అభివృద్ధి పనులు చేపట్టగా.. రూ.8 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.499.67 కోట్లతో 66 అభివృద్ధి పనులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రూ.75 కోట్లతో ఐదు అంతస్తులు, 32 ప్లాట్‌ఫాంలతో బస్టాండ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు వివరించారు. జిల్లాలో గ్రీన్ హెరిటేజ్ కింద పాకాల బయోడైవర్సిటీ పార్కు అభివృద్ధి చేశామని కలెక్టర్ సత్య శారద తెలిపారు. నర్సంపేట అటవీ రేంజ్ పరిధిలో 5,245 మంది పోడు రైతులకు 12,719 ఎకరాలకు పట్టాలను అందించామని తెలిపారు. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని, డ్రగ్స్ భూతాన్ని జిల్లా నుంచి శాశ్వతంగా తరిమేయాలని ఆమె సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం 284 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌యాదవ్, ఆర్టీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఏసీపీలు నందిరాంనాయక్, తిరుపతి, ఇన్‌స్పెక్టర్లు వెంకటరత్నం, గోపి, అధికారులు పాల్గొన్నారు.



ప్రశంసపత్రాలతో నృత్య కళాకారులు



స్టాళ్లను తిలకిస్తున్న కలెక్టర్





సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న బాలికలు

హరితహారం పేరుతో హరీశ్‌రావు దోపిడీ

- మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్



రాంతీర్థంలో లబ్ధిదారుకు మంజూరు పత్రం అందిస్తున్న ఎంపీ బలరాంనాయక్, అధికారులు

నల్లబెల్లి: హరితహారం పేరుతో మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను దోపిడీ చేశారని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. రాంతీర్థంలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ పథకాలను డీఆర్‌డీఓ కౌసల్యాదేవితో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. రాంతీర్థం గ్రామానికి చెందిన అర్హులైన రైతుల ఖాతాల్లో తెల్లారేసరికి రైతు భరోసా డబ్బులను ప్రభుత్వం జమచేస్తుందన్నారు. గత ప్రభుత్వం హరితహారం పేరుతో ఏడాదిలో రూ.22 వేల కోట్ల నిధులు దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. రైతు భరోసా 340 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 23 మంది, కొత్త రేషన్ కార్డులు 41 మంది, ఇందిరమ్మ ఇళ్లు 33 మందికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్లు తమకు మంజూరు కాలేదని సుమారు 10 మంది ఎంపీ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం.. ఆందోళన చెందాల్సిన పనిలేదు.. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోవిందరాజన్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఎంపీఓ రవి, ఏఓ రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారి నియామకం

నర్సంపేట: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణిని నియమించారు. సోమవారం నుంచి ప్రత్యేక అధికారి చేతికి పాలన వెళ్తుండడంతో సమస్యలు పరిష్కారం కానున్నాయి.

కేఎంటీపీలో డ్రెయిన్ పనులు ప్రారంభం



డ్రెయిన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో రూ.160 కోట్ల నిధులతో చేపట్టిన మెగా డ్రెయిన్ నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ పనులకు గత ఏడాది నవంబర్ 16న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయగా ఇటీవల టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. శాయంపేటహవేలి శివారులోని రాళ్లమాటు వాగులోకి ఎగువన ఉన్న బొల్లికుంట, కాట్రపల్లి, వెంకటాపూర్ నుంచి వచ్చే వరద నీరు కేఎంటీపీలోని పలు కంపెనీల యూనిట్లలోకి చేరకుండా సంగెం మండలం ఎల్గూరు రంగంపేట చెరువులోకి వెళ్లేలా డ్రెయిన్‌ను నిర్మిస్తున్నారు. సుమారు 5 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కాల్వ 80 మీటర్ల వెడల్పులో ఉండి, ఇరువైపులా ఐదు మీటర్ల ఎత్తులో డ్రెయిన్ గోడ ఉండేలా నిర్మాణం చేయనున్నారు. ఇరిగేషన్ ఈఈ సునీత, డీఈ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు దొమ్మాటి సాంబయ్య, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల నాయకులు దూల వెంకటేశ్వర్లు, దౌడు అనిల్, నాగరాజు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

90 ఏళ్ల వయస్సులో దేశభక్తి

- జల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరించిన యాకూబ్‌రెడ్డి



జల్లి గ్రామంలో జాతీయ ఎగుర వేస్తున్న కేతిడి యాకూబ్‌రెడ్డి

చెన్నారావుపేట: జల్లి గ్రామానికి కేతిడి యాకూబ్‌రెడ్డి 90 ఏళ్ల వయస్సులో దేశభక్తి చాటుకున్నారు. సర్పంచ్‌గా పనిచేసిన ఆయన పేదలకు ఇళ్లు మంజూరు చేసేందుకు ఎంతోకృషి చేశారు. మంచి ప్రజాప్రతినిధిగా గుర్తింపు తెచ్చుకుని 50 సంవత్సరాలు దాటింది. అయినా జాతీయ జెండాపై ఎనలేని అభిమానం. గ్రామంలోని వాణినికేతన్ పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు హాజరై జెండావిష్కరణ చేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. దేశభక్తిని చాటిచెబుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇన్నోవేటర్లకు అవార్డులు



రాష్ట్రస్థాయి ఉత్తమ ఇన్నోవేటర్ అవార్డులు అందుకున్న కొమ్మెర దినేశ్, బందెల శ్రీకాంత్

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కొమ్మెర దినేశ్, విద్యావేత్త బందెల శ్రీకాంత్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఇన్నోవేటర్లుగా ఎంపికయ్యారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ నుంచి గ్రామపంచాయతీకి ఉత్తర్వులు జారీ చేసి అవార్డులు, ప్రశంసపత్రాలు పంపించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ మోడెం శ్రీధర్‌గౌడ్ వారికి అవార్డులు, ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ముక్కెర ఆనంద్, ఉన్నత పాఠశాల హెచ్ఎం జూలూరి జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫెల్లోషిప్స్ కలిగిన విద్యార్థులు యూజీసీనెట్, సీఎస్ఐఆర్ నెట్, సీడ్, డీఎస్‌టీ, ఎన్ఈఎఫ్‌డబ్ల్యూడీ, డీఎస్‌టీ–ఇన్‌స్పైర్ లేదా ఎఫ్ఐపీ, క్యూఐపీ టీచర్ ఫెల్లోషిప్స్ తదితర నెట్, గేట్, జీప్యాట్ నేషనల్ లెవల్ టెస్ట్ స్కోర్స్ నెట్ కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లను సంబంధిత కార్యాలయంలో ఫిబ్రవరి 12 లోపు అందజేయాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బోటనీ 6, కెమిస్ట్రీ 3, జియాలజీ 1, మ్యాథ్‌మెటిక్స్ 5, ఫిజిక్స్ 2, జువాలజీ 11 సీట్లు ఉన్నాయని వివరించారు.

పాకాలను సందర్శించిన సివిల్ జడ్జి

ఖానాపురం: మండలంలోని పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సును ఆదివారం నర్సంపేట మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ సందర్శించారు. ఈసందర్భంగా చిలకలగుట్ట, బటర్‌ఫ్లై గార్డెన్, ఔషధ తోటతోపాటు పాకాల సరస్సులో బోటింగ్ చేసి అందాలను తిలకించారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ బాధ్యులు అంబటి శ్రీనివాస్, న్యాయవాదులు మోటూరి రవి, సంజయ్‌కుమార్, రహీమొద్దీన్, రవి, రమేశ్, రాజేశ్ ఉన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కేయూ క్యాంపస్: యువత మత్తుకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో మత్తు పదార్థాల నియంత్రణపై రెండ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువత ఇందులో పాల్గొనగా.. ముగింపు సమావేశంలో ఈసం నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత తమలోని నైపుణ్యాలను వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి సమాజానికి ఉపయోగించుకోవాలన్నారు. రిసోర్స్‌పర్సన్, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కమ్యూనిటీ మొబలైజేషన్‌పై అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి అన్వేశ్ పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు



అదనపు కలెక్టర్ సంధ్యారాణికి ప్రశంసపత్రం అందిస్తున్న కలెక్టర్ సత్య శారద

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగులు ఆదివారం ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఖిలా వరంగల్ ఖుష్‌మహల్‌లో జరిగిన వేడుకల్లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసపత్రాలు అందజేసి సన్మానించారు.
– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



జి.రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ | ఎం.బాలకృష్ణ, డీపీఏ హెచ్ఓ | శ్రీకాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | జె.తిరుపతి, సీనియర్ అసిస్టెంట్



కె.దినకర్‌దేవ్, కలెక్టర్ సీసీ | రవికృష్ణ, అదనపు కలెక్టర్ సీసీ | కోటేశ్వర్, ఆఫీస్ సబార్డినేట్ | పి.కొమురయ్య, డ్రైవర్ | ఎండీ రాజీమహ్మద్, ఆఫీస్ సబార్డినేట్ | పాషా, ఆఫీస్ సబార్డినేట్ | ఎన్.రంజిత్‌కుమార్, డీటీ | జి.రాజ్‌కుమార్, తహసీల్దార్ | ఎండీ.సఫియా, ఆఫీస్ సబార్డినేట్ | యు.శ్రీనివాస్, చైన్‌మెన్ | బి.ప్రేమలత, అడిషనల్ డీపీఆర్ఓ | శ్రీకాంత్, ఫొటోగ్రాఫర్



టి.గోపి, ఇన్‌స్పెక్టర్ | టి.యాదగిరి, ఏఎస్సై | కె.ఉమాదేవి, కానిస్టేబుల్ | బి.తిరుపతి, ఏసీపీ, మామునూరు | ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్సై | టి.శ్రీకాంత్, ఎస్సై | ఆర్.రామారావు, ఎస్సై | పి.రాధిక, ఎస్సై | పి.అరుణ, ఆర్ఎస్సై | మహ్మద్ జావేద్, జోనల్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఇంటెలిజెన్స్ | పి.రవి, కానిస్టేబుల్ | ఎ.సరిత, ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ శాఖ



డాక్టర్ కేఎస్ పద్మశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్ | ఎం. కవిత ఎంపీహెచ్ఏ | ఎం.మంజుల అకౌంటెంట్ | బి.హరిత, హెచ్‌డబ్ల్యూఓ | బి.రమ, హెచ్‌డబ్ల్యూఓ | కె.శంకరయ్య, ఏబీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ | యూసఫ్, హెచ్‌డబ్ల్యూఓ, ట్రైబల్ వెల్ఫేర్ | మున్నావర్ అలీ, కంప్యూటర్ ఆపరేటర్ | బీఎల్.మాధవి, ఏడీఏ | వై.తాన్య, ఏఓ | ఎం.హనుమంతు, ఏఈఓ | బి.విద్యాసాగర్, ప్రొఫెసర్



జి.స్వాతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ | డాక్టర్ ఓంకార్, శాస్త్రవేత్త | జి.నీలిమ, శాస్త్రవేత్త | టి.బాలాజీ, ఏడీ, వెటర్నరీ శాఖ | జి.వేణుగోపాల్, వెటర్నరీ ఆఫీసర్ | వి.భవానీదేవి, అంగన్‌వాడీ టీచర్ | కరుణశ్రీ, ప్రిన్సిపాల్ | డి.రజిత, పంచాయతీ కార్యదర్శి | కె.రేణుకాదేవి, అడిషనల్ డీఆర్‌డీఓ | జ్ఞానేశ్వర్, డీఈఈ, పంచాయతీరాజ్ | ఎం.సురేశ్, డీఈఓ, సివిల్ సప్లయీస్ | రమాదేవి, డీఈఈ, ఆర్‌అండ్‌బీ



ఎన్.కుమారస్వామి, జూడో కోచ్ | రేణుక, డీఎంసీ, మెప్మా | సీహెచ్.లావణ్య, ఎస్ఎల్ఎఫ్ ఆర్‌పీ | ఎ.ప్రవీణ్, సీఓ | మోహన్‌దాస్, ప్రిన్సిపాల్, నర్సంపేట మెడికల్ కాలేజీ | ఆదిలక్ష్మి, హెడ్ నర్సు | ఎస్.ఉమారాణి, నర్సింగ్ ఆఫీసర్ | బి.సౌజన్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ | మురళి, ఆర్ఎంఓ, ఎంజీఎం | శ్రీనివాస్, ఆర్ఎంఓ, ఎంజీఎం | పి.జ్యోతి, ఆఫీస్ సబార్డినేట్ | గరిమిళ్ల పద్మప్రియ (నృత్య కళాకారిణి)

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: కలెక్టర్ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో డీఆర్ఓ విజయలక్ష్మి, ఏఓ, సూపరింటెండెట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో డిప్యూటీ సీఈఓ ఎస్.వసుమతి, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



జెడ్పీలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఈఓ రాంరెడ్డి

రిపబ్లిక్‌డే వేడుకల్లో గంగదేవిపల్లి మాజీ సర్పంచ్



రిపబ్లిక్ డే వేడుకల్లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మల్లారెడ్డి దంపతులు

గీసుకొండ: న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ అభివాదం చేస్తుండగా వాహనాల పరేడ్, పలు విన్యాసాలను తిలకించారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రతలో గంగదేవిపల్లి సాధించిన విజయాలను ప్రధాని మోదీ పలుమార్లు అభినందించారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్: పీసీసీ ఆదేశానుసారం కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వరంగల్ పోచమ్మమైదాన్‌లో ఆదివారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రారంభించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష శ్రీమన్, మాజీ కార్పొరేటర్లు తత్తెర లక్ష్మణ్, జన్ను అరుణ్, దామెర సర్వేశం, దూపం సంపత్, బిల్లా కవిత శ్రీకాంత్, జన్ను రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్, నాయకులు ఎండీ తాహేర్, ఎండీ జహీర్, ఎండీ ఇంతియాజ్, ఎండీ ఇమ్రాన్, ఎండీ మస్తాన్, కరాటే ప్రభాకర్, బైరబోయిన చంద్రమౌళి, తోట బాలరాజు, మార్త ఆంజనేయులు, చిరంజీవి, బాబు, కోదాటి అనిల్, చాగంటి శ్రీనివాస్, అందే సునీల్, సందెల దామోదర్, రామ యాదగిరి, వెల్దండి లక్ష్మణ్, 300 మంది పాల్గొన్నారు.

నలిగిన వలస బతుకులు

ట్రైలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడనీ కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదు రోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతడి అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటా లియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ అతివేగంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువురు సంతోశ్ చౌహాన్(45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18) అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు.



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్థాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతడికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆ జేసీబీల సాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం తీసుకుంది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రేలర్ ట్రక్కును జేసీబీల సాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుప రాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు..


మామునూరు ప్రధాన రహదారికి అనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్న వారు అయ్యో పాపం అని చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోశ్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళ్తే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.

రూ.200 డీజిల్ పోయించుకున్నారు



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రేలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.
– జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడా..



గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.
– సుమీర్, సంతోశ్ అన్న కుమారుడు

మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.



ఘటనాస్థలిలో కలెక్టర్ సత్యశారద

మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిపాలనాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..



క్షతగాత్రులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.